క్లుప్తంగా

పాహిమాం.. నీలకంఠా!


పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

● జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు

పొదిలి రూరల్: మహాశివరాత్రి పండగ సందర్భంగా పొదిలి పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామిని శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ దర్శించుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం దేవస్థానం చైర్మన్ యక్కలి వేషగిరిరావు, ఈఓ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు వెంకాయమ్మకు మేళ తాళాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పంచకోవెల ఆలయాలను దర్శించుకున్నారు. వేదపండితులు ఆమెకు ఆశీర్వాదాలు అందించారు. ఆ తర్వాత తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పాలక మండలి సభ్యులు శాలువాతో సత్కరించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమనారెడ్డి, వినోద్, ముల్లా జాకీర్, మల్లాపురం నరసింహులు, అంబవరపు నారాయణరెడ్డి, బాబు, గిరి, హసన్‌వలి ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఒకేఒక పోలింగ్ కేంద్రం

పుల్లలచెరువు: మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మండల కేంద్రంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దాసు శనివారం తెలిపారు. పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు 694, ఉపాధ్యాయులు 24 మంది ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే కేంద్రంలో అన్ని వసతులు సిద్ధం చేశామని, పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని తహసీల్దార్ దాసు తెలిపారు.

రామచంద్ర యాదవ్‌కు ఘన స్వాగతం


సన్మానం అందుకుంటున్న రామచంద్ర యాదవ్

గిద్దలూరు రూరల్: యాదవ్ యూత్ ఐకాన్ బోడె రామచంద్ర యాదవ్ పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు బీసీ నాయకుడు పెట్టెల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో యువకులు ముండ్లపాడు రోడ్డులోని ఆదర్శ బీఈడీ కళాశాల వద్ద ఘన స్వాగతం పలుకుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమాజంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టరేట్ అవార్డు గ్రహీత మొర్రి పిచ్చయ్య యాదవ్‌ను ఆయన సన్మానించారు. యాదవ సంఘ నాయకులు వెంకటయ్య యాదవ్, రాజగోపాల్ యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, పాండు యాదవ్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలు


పూజలు చేస్తున్న కమిషనర్ చెన్నారెడ్డి

మార్కాపురం: రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సమాచార కమిషనర్ చెన్నారెడ్డి అన్నారు. శనివారం ఆయన మార్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ శ్రీనివాసరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమాచార కమిషన్‌లో ముగ్గురు మాత్రమే సభ్యులు ఉండేవారని ప్రస్తుత ప్రభుత్వంలో మొత్తం ఆరుగురు కమిషనర్లు ఉన్నారన్నారు. సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్ని శాఖల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

850 మందికి వైద్య పరీక్షలు

మార్కాపురం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ పగడాల లక్ష్మీరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలని తిప్పాయపాలెంలో అరుణాచల ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలోని పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తానన్నారు. 850 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించినట్లు లక్ష్మీరెడ్డి తెలిపారు.


పెద్దారవీడులో ప్రత్యేక అలంకరణలో శివలింగం


దర్శి: దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కేపీ, చైర్మన్


దొనకొండ: పెద్దగుడిపాడు శివాలయంలో..


పెద్దదోర్నాల: వాహనాల తనిఖీ


కొనకనమిట్ల: బ్రాహ్మణపల్లిలో..


పొదిలి రూరల్: మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


ముండ్లమూరు: మారెళ్లలో బారులు తీరిన భక్తులు


మార్కాపురం: శివాలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

హరహర మహాదేవ శంభో శంకర

● వాడవాడలా మహాశివరాత్రి వేడుకలు ● ఆలయాల్లో ప్రముఖుల ప్రత్యేక పూజలు
● దర్శి, మార్కాపురం, గిద్దలూరు,వై.పాలెం నియోజకవర్గాల్లోని ఆలయాల్లో పోటెత్తిన భక్తులు


కంభం: వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల సందడి


పొదిలి రూరల్: ముస్తాబైన శివలింగాలు

దర్శి: మహాశివరాత్రి వేడుకలు శనివారం భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పలువురు ప్రముఖులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. దర్శి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. దర్శి మండలంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కాశీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామావలి పూజలు చేశారు. స్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. 11 గంటలకు విద్యార్థులు నిర్వహించిన భరత నాట్యం అందరినీ అలరింపజేసింది. సాయంత్రం స్వామి వారిని నగరోత్సవానికి తీసుకెళ్లేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన రథాన్ని సిద్ధం చేశారు. మధ్యాహ్నం హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కొర్లమడుగు, పోతవరం, పొతకమూరు శివాలయాలు శివరాత్రిని భక్తులతో కిటకిటలాడాయి.

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే యాత్రికులు, శివభక్తులకు మండల పరిధిలోని శ్రీశైలం రహదారిలో పలు ధార్మిక సంస్థలు అన్నదానంతో పాటు, మంచినీరు, మజ్జిగ పాకెట్లను అందజేసి తమ తమ సేవా కార్యక్రమాలను ముమ్మరం చేశారు. యాత్రికులకు భోజన వసతితో పాటు అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. మండల రెడ్ల సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటా రమణారెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్, శ్రీకృష్ణ దేవరాయల కాపు, బలి ఒంటరి తెలగ సేవాసంఘం ఆధ్వర్యంలో, మార్కాపురానికి చెందిన శివదీక్ష సంఘం సేవా భారత్ ఆధ్వర్యంలో, చౌడేశ్వరి ఆలయం వద్ద వీర క్షత్రియ తొగట సంఘం, దర్శి మండలం తానం చింతల గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీ బాలంకయ్య, ఏఈ గోపితో పాటు యూనియన్ నాయకులు రమణారెడ్డి, బీవీ యల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 51 సెంట్ల స్థలాన్ని అధికారులు ఆర్టీసీ బస్టాండుకు కోసం కేటాయించారు. సర్పంచ్ చిత్తూరి హారిక, పంచాయతీ కార్యదర్శి మోహనరావు స్థలాన్ని చదును చేయించారు. చలివేంద్రాలను తహసీల్దార్ వేణుగోపాలరావు, సర్పంచ్ చిత్తూరి హారిక, కార్యదర్శి మోహనరావు పరిశీలించారు. శ్రీశైలం వెళ్లే పలు వాహనాలను ఆర్టీఏ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, ఒంగోల్, నెల్లూరు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు గోపినాయక్ పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలో పలు గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శివనామస్మరణతో భక్తులతో శివాలయాలు పొటెత్తాయి. పెద్దారవీడు, గొబ్బూరు శివాలయాలు, దేవరాజుగట్టులో కాశినాయన ఆశ్రమంలో అర్చకులు మేడవరం రాఘవేంద్ర శర్మ, భరద్వాజశర్మ, దత్తయ్య పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పుల్లలచెరువు: మన్నేపల్లి, శతకోడులోని శష్తకోటేశ్వరాలయం, ముటుకుల శివాలయాల్లో శివునకు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. రాత్రికి ప్రభలను ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలను నిర్వహించారు. దేవరాజుగట్టులో కాశినాయన ఆశ్రమంలో అర్చకులు మేడవరం రాఘవేంద్రశర్మ, భరద్వాజశర్మ, దత్తయ్య పూజలు నిర్వహించారు.

కొనకనమిట్ల: హరహర మహాదేవా శంభో శంకరా.. అంటూ..జ్యోతి స్వరూపుడైన పరమ శివుడు లింగం రూపంలో ఉద్భవించే పరమ పవిత్రమైన మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం మండలంలోని శైవక్షేత్రాల్లో వైభవంగా జరుపుకున్నారు. బ్రాహ్మణపల్లి కాశీ విశ్వేశ్వర దేవాలయం, ఎదురాళ్లపాడు, అంబాపురం గ్రామాల్లోని సంగమేశ్వర దేవాలయాలు, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, శివాలయం, రేగడపల్లి, చినారికట్ల, పెదారికట్ల, సలనూతల, బచ్చలకూరపాడు గ్రామాల్లోని రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోమాతను పూజించి మహిళలు తమ భక్తిని చాటుకున్నారు. బ్రాహ్మణపల్లిలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కొమరోలు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శనివారం తెల్లవారు జాము నుంచి శివాలయాల్లో భక్తులు కిటకిటలాడారు. గోపాలునిపల్లెలో వెలసిన త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయం, పాములపల్లె ప్రధాన రహదారిలో వెలసిన సాంబసదా శివాలయం, దామెర్ల చెరువు వద్ద వెలసిన సిద్ధభైరవేశ్వరస్వామి దేవాలయం, పొట్టిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన భృగుమల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రాచర్ల: రామాపురం సమీపంలోని సిద్ధిభైరవేశ్వర, అక్కపల్లె కనకసురభేశ్వర, సత్యవోలు రామలింగేశ్వర దేవస్థానాల్లో శివరాత్రి పండగ సందర్భంగా వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామాపురం సిద్ధిభైరవేశ్వర స్వామి దర్శనం కోసం గిద్దలూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ధర్మకర్త మదిరె శ్రీరంగారెడ్డి అన్ని వసతులు కల్పించారు. రామాపురం గ్రామానికి చెందిన మదిరె శ్రీరంగారెడ్డి, భార్య రమాదేవితో పాటు కుమారుడు మదిరె మల్లికార్జున్‌రెడ్డి, కుమార్తెలు ఉషారాణి, శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అన్ని గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదానాన్ని శనివారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏలూరు, ఉప్పలపాడు, ఆముదాలపల్లి, పాములపాడు, కుంచేపల్లి, మల్లవరం, ఓబులక్కపల్లి, రామాపురం, జువ్వలేరు దేవాలయాల్లో శివరాత్రి వైభవంగా నిర్వహించారు. పొదిలి పట్టణంలో దక్షిణ కాశీగా పిలువబడుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర దేవస్థానంలో స్వామివారు నందిసేవతో ఉమమహేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన త్రీడీ శివలింగం భక్తులను ఆకర్షించింది.

కురిచేడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం స్థానిక శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తుల శివనామస్మరణతో పులకించింది. వేకువ జాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు ఆలయ పూజారులు కురిచేటి సుబ్బరాయశర్మ, ఎర్ర శేషయ్యలు భక్తులతో చేయించారు. స్వామి వారి ఏకాహం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శనివారం అర్ధరాత్రి స్వామివారి లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు, అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు.

దొనకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్దగుడిపాడు, చందవరం, గంగదేవిపల్లి, ఇండ్లచెరువు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల నుంచి మహాశివరాత్రి సందర్భంగా త్రిపురాంతకం, మహానంది, శ్రీశైలం, కోటప్పకొండ, అమరావతి పుణ్యక్షేత్రాలకు భక్తులు తరలి వెళ్లారు. పెద్దగుడిపాడు శివాలయంలో దొండపాడు గ్రామానికి చెందిన బసవయ్య అన్నదానం చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వెలసిన ఆనంద ఆశ్రమంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి ఆలయ ధర్మకర్త భైరవానంద స్వామి ఆధ్వర్యంలో విశ్వేశ్వర స్వామికి పూజారి మణిబాబు ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. దాతల సహకారంతో అన్నదానం చేశారు.

తాళ్లూరు: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. పలు దేవాలయాల్లో శివనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. శివరామపురం, బొద్దికూరపాడు, లక్కవరం తాళ్లూరు, మాధవరం గ్రామాల్లోని అగస్త్యేశ్వరాలయం, సోమేశ్వరాలయం, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించారు.

బేస్తవారిపేట: మండలంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పురాతన శైవ క్షేత్రాలైన మోక్షగుండం ముక్తీశ్వరస్వామి, ఒందుట్లలోని బృగుమహేశ్వరస్వామి, పిటికాయగుళ్లలోని పిటికేశ్వరస్వామి, పందిళ్లపల్లెలోని వ్యాఘ్రమల్లేశ్వరస్వామి, జేబీకే పురంలో ఆదిసిద్ధి భైరవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 4 గంటల నుంచి ఏర్పాటు చేసిన కులుకు భజనలు, రాత్రికి సత్యహరిశ్చంద్ర, చింతామణి నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

తర్లుపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కేతగుడిపిలో కేదారేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. ఎంపీపీ భూలక్ష్మి దంపతులు, జెడ్పీటీసీ ఇందిర, ఆమె భర్త, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డితో కలిసి పూజలు చేశారు. పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, మీరావలి, శేఖర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, కోటిరెడ్డి, కూడా పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ పెద్ద మస్తాన్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ముండ్లమూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాల్లో శనివారం హరిహర మహాదేవ శంభోశంకర నామ స్మరణతో మార్మోగాయి. భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పెదరావిపాడు రాజమల్లేశ్వరస్వామి సమేత భ్రమరాంబదేవి ఆలయం, మారెళ్లలో హరిహర దత్త క్షేత్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం, పసుపుగల్లు అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, పులిపాడులోని అన్నపూర్ణ సమేత పూర్ణేశ్వరస్వామి ఆలయం, ఈదర గంగా పార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయం, ముండ్లమూరు మల్లమాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి మారెళ్లలోని హరిహరదత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

మార్కాపురం టౌన్: పలు గ్రామాల్లో శివరాత్రి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేములకోట, గజ్జలకొండ, తిప్పాయపాలెం గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు వెళ్లి శివునికి అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు శ్రీశైలం, త్రిపురాంతకం పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. తిప్పాయపాలెం ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేములకోట శివాలయంలో అర్చకులు డి.శేఖర్‌శర్మ, నాగరాజులు రుద్రాభిషేకాలు చేశారు. నిర్వాహకులు డి.వెంకటరామయ్య, టి.సుబ్బారెడ్డి, రామిరెడ్డి, ఆవులయ్య, చాగంటి సుబ్బారెడ్డి తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం వేకువ జామున 4 గంటల నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో వెలసిన శ్రీ జగదాంబ సమేత శ్రీ మార్కండేశ్వర స్వామికి ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, అర్చక బృందం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీ జగదాంబ అమ్మవారికి అర్చకులు తేజ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పలువురు ప్రముఖులు, అధికారులు, ప్రజలు శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్ వి.కేశవరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, శ్రీనులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ ఎస్‌ఐ శశికుమార్ తన సిబ్బందితో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. రాత్రి 8 గంటలకు ఎదురుకోల, గ్రామోత్సవం తెల్లవారు జామున పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు.

కంభం: మహాశివరాత్రి పండగను శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం, తురిమెళ్ల పరిధిలోని సురభేశ్వరకోన, రావిపాడు శివాలయం, పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రి పండగ సందర్భంగా మండలంలోని పలు శైవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఎమ్మెల్యే అన్నా రాంబాబు పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలంయలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవంతో పాటు ప్రభ వంటి కార్యక్రమాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కొండ మీద గల శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఆవరణలోని గిరిజానాథ స్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ముండ్లపాడులోని భవాని శంకర్ ఆలయం, పలుపులవీడులోని భైరవేశ్వరస్వామి ఆలయం, కెఎస్ పల్లె సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం, సంజీవరాయుడుపేట గ్రామ సమీపంలోని బోడీశ్వరుడి వద్ద, నల్లమల అటవీ ప్రాంతంలోని గుండ్ల బ్రహ్మేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరాలయం, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. మోట్లమల్లికార్జున పురం మోట్లమల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు.


తాళ్లూరులో పూజలందుకుంటున్న స్వామివారు


రాచర్ల: అలంకరణలో సిద్ధిభైరవేశ్వర స్వామి


కొమరోలు: పూజలందుకుంటున్న శివలింగం


పెద్దదోర్నాల: రెడ్ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం


కురిచేడు: కల్యాణానికి సిద్ధంగా ఉన్న స్వామివార్లు


పెద్దారవీడు: శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


పెద్దదోర్నాల: మోట్లమల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు..

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


మంత్రి సురేష్‌కు వినతి పత్రం అందిస్తున్న కాలేషా


ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్


బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన సొంత నిధులను రోడ్డు ప్రమాద బాధితులకు శనివారం ఆర్థిక సహాయం చేశారు. ఈ నెల 1న త్రిపురాంతకం మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి మిరప కోతలకు వెళ్తున్న కూలీల ఆటోను మరో ఆటో ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో 8 మందికి గాయాలయిన సంఘటన విదితమే. ఈ మేరకు మంత్రి బాధితులను పరామర్శించడం తోపాటు మృతుడి భార్యకు రూ. 50 వేలు, తీవ్రగా గాయపడిన ఇద్దరికి రూ. 20 వేలు, స్వల్ప గాయాలయిన మరో ఇద్దరికి రూ. 10వేల చొప్పున వై. పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మందుల ఆదిశేషు, పార్టీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, ఎస్సీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు పథకాలు అందించాలి

యర్రగొండపాలెం: దివ్యాంగులకు సంక్రమించాల్సిన ప్రభుత్వ పథకాలను సంబంధిత అధికారులు నీరు కార్చుతున్నారని, దీనివలన తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితీ నాయకులు ఆరోపించారు. శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు స్థానిక తన క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. త్రిచక్ర మోటారు వాహనాలను నియోజకవర్గానికి 10 ప్రకారం మంజూరు చేశారని, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. కానీ మోటారు వాహనాలను పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ. కోటి మంజూరు చేసిందని, వాటిలో రూ.62 లక్షలు 22 మందికి మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే కలెక్టర్ దినేష్ కుమార్, ఏడీ అర్చనతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా, జిల్లా అధ్యక్షుడు పి.భానుప్రకాష్, ఉపాధ్యక్షుడు నజీర్‌బాష ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలించిన మంత్రి సురేష్

పెద్దదోర్నాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 51 సెంట్ల స్థలాన్ని అధికారులు ఆర్టీసీ బస్టాండుకు కోసం కేటాయించారు. బస్సులు నడిపేందుకు వీలుగా సిద్ధం చేయాలని మంత్రి సురేష్ మేజర్ పంచాయతీ ఈఓ మోహనరావును ఆదేశించారు.